పండుగ చేసుకునేదెలా..?

- రెండు నెలలుగా అందని వేతనాలు
- ఇబ్బంది పడుతున్న పంచాయతీ కార్మికులు

లక్ష్మణచాంద: హిందువులకు ముఖ్యమైన పండుగల్లో విజయదశమి ఒకటి. దసరా పండుగ వచ్చిందంటే ప్రతీ కుటుంబ పెద్ద తమ ఆర్థికస్థితికి తగ్గట్టు ఇంట్లోని సభ్యులందరికీ నూతన వస్త్రాలు కొనడం ఆనవాయితీ. కానీ జిల్లాలోని పంచాయతీ కార్మికులకు రెండు నెలల(ఆగస్టు, సెప్టెంబర్)కు సంబంధించిన వేతనాలు రాలేదు. ఓ వైపు పిల్లలు బట్టలు కొనివ్వమని అడుగుతున్నారని.. మరోవైపు నిత్యావసర సరుకులు తెచ్చి పిండివంటలకు చేసుకుందామన్నా డబ్బులు లేవని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ వేళ అప్పులు కూడా పుట్టడం లేదని.. సంబంధిత అధికారులు స్పందించి వేతనాలు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

జిల్లాలోని 395 పంచాయతీల్లో 1520 మంది కార్మికులు..


చెత్తను ఎత్తి ట్రాక్టర్‌లో పోస్తున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ కార్మికుల పాత్ర వెలకట్టలేనిది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్‌యార్డులు, హరితహారం, పల్లె ప్రకృతివనాల్లో నిత్యం సేవలందిస్తున్నామని పంచాయతీ కార్మికులు పేర్కొంటున్నారు. జిల్లాలో మొత్తం 395 గ్రామపంచాయతీల్లో మొత్తం 1520 మంది పంచాయతీ కార్మికులు పని చేస్తున్నారు. వీరందరికీ ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన వేతనాలు రాలేదు.

కొత్తబట్టలు కొనలేదు..



రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో దసరా పండుగకు మా కుటుంబసభ్యులకు కొత్త బట్టలు కొనలేదు. పండుగ పూట పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి వేతనాలు మంజూరు చేయాలి.
– ఉదయ్‌కిరణ్, పంచాయతీ కార్మికుడు, పీచర

అప్పులు చేస్తున్నాం..



మాకు రావాల్సిన రెండు నెలల వేతనాలు వస్తేనే పండుగ చేసుకుంటాం. లేకుంటే పస్తులే. సకాలంలో వేతనాలు రాక అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు.
– పోశెట్టి, పంచాయతీ కార్మికుడు, మల్లాపూర్

అధికారులకు నివేదించాం



జిల్లాలోని గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు ఆగస్టు నెలకు సంబంధించి వేతనాలు చెల్లించాలని మండలాల ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశాం. సెప్టెంబర్ నెల వేతనాల కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే కార్మికుల ఖాతాల్లో జమ చేస్తాం.
– శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి

పరిశుభ్రతపై దృష్టి సారించాలి


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ సమద్

తానూరు: గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. మంగళవారం మండలంలోని బోల్సాలో పర్యటించారు. రోడ్లు, మురికి కాలువలను పరిశీలించారు. మురికికాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని పేర్కొన్నారు. కార్యదర్శి వినయ్‌కుమార్ ఉన్నారు.

ఖానాపూర్: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని గోసంపల్లె, సత్తన్‌పల్లి గ్రామాల్లో ఎంపీవో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్, శానిటేషన్‌పై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.

నిల్వనీటిని పారబోయాలి

కుభీర్: మండలంలోని బ్రహ్మేశ్వర్, పార్డి(బి) గ్రామాల్లో ఆధ్వర్యంలో మంగళవారం డ్రై డే నిర్వహించారు. అధికారులు వీధుల్లో తిరుగుతూ డ్రమ్ములు, పాత్రల్లో నిల్వనీటిని పారబోయించారు. అనంతరం పార్డి(బి)లో పంచాయతీ రికార్డులను పరిశీలించారు. సకాలంలో ఇంటిపన్నులు వసూలు చేయాలని పేర్కొన్నారు. ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పీచరలో మంగళవారం డ్రై డే నిర్వహించారు. పార్‌పెల్లి ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది వీధులు తిరుగుతూ నిల్వనీటిని పారబోయించారు. జ్వరంతో బాధపడుతున్న వారి రక్తనమునాలు సేకరించి మందులు అందించారు. సిబ్బంది హరికుమార్ గౌడ్, శివకృష్ణగౌడ్, ఎంపీఓ అమీర్‌ఖాన్, కార్యదర్శి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్

ఖానాపూర్: మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలను విడుదల చేయాలని కోరారు. బిల్లులు చెల్లించకుంటే వారితో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాధ, సత్తమ్మ, అమృత, సరిత, అనురాధ, మంగ ఉన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ బంద్

నిర్మల్‌చైన్‌గేట్: 33/11 నిర్మల్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ నటరాజ్ ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇందిరానగర్, గొల్లపేట, శాస్త్రీనగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రత్యేక వైద్యశిబిరం

ఖానాపూర్: పట్టణంలోని 12వవార్డు పరిధిలో ఉన్న సుభాష్‌నగర్‌లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారందరికీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నారాయణ, రాజు, మీరాబాయి, పద్మ, పుష్ప, నాయకులు షబ్బీర్‌పాషా, సలీం ఖాన్ తదితరులు ఉన్నారు.

కార్మికుల నిరసనకు మద్దతు


మద్దతుగా దీక్షలో కూర్చొన్న నాయకులు

నిర్మల్‌టౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ఎనిమిదో రోజు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారికి బీఆర్‌ఎస్, సీపీఎం, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. అంతకుముందు నిరసన విరమింపజేయాలని మున్సిపల్ కౌన్సిలర్లు కార్మికులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు బోనాలు


ఆలయం వద్ద భక్తులు

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి)లో మంగళవారం భక్తులు గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. ఏటా గంగనీళ్ల జాతర అనంతరం గ్రామదేవతలకు బోనాలను నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా పోచమ్మ, మహాలక్ష్మీ, ముత్యాలపోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కుభీర్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేసి వినియోగదారుల సమస్యలు పరిష్కరించారు. ఈసందర్భంగా కుభీర్‌లో 11కేవీ విద్యుత్ లైన్ ఎప్పుడు పూర్తవుతుందని గ్రామస్తులు ప్రశ్నించగా.. రెండు వర్గాలుగా ఏర్పడి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని అందరూ కలిసి చెబితే అటువైపు నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ నారాయణ, రామకృష్ణ, టెక్నికల్‌సభ్యులు కిషన్, ఫైనాన్స్ సభ్యులు, రాజాగౌడ్, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ అజీజొద్దీన్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు


పూజలు చేస్తున్న నాయకులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని మహిళా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కర్నాల శైలజారెడ్డి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మహిళా నేతలకు అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత అమ్మవారి అక్షరాభ్యాసం మండపంలో కుంకుమార్చన పూజలు చేయించారు. అనంతరం హారతి, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

బీజేపీ నాయకుల సంబురాలు


స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

సోన్: ఇటీవల జరిగిన హర్యానా రాష్ట్రంతో పాటు, జమ్మూ,కశ్మీర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అధిక స్థానాలు సాధించడంపై ఆ పార్టీ నాయకులు రావుల రాంనాథ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సోన్‌లో బీజేపీ నాయకులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. బీజేపీ నాయకులు ముత్కపల్లి నరేశ్, శ్రీనివాస్‌రావు, దాసరి శ్రీనివాస్, మధుసూదన పతి, రంజిత్, దాసరి రాజు, సత్యం, శ్రావణ్ తదితరులున్నారు.

రోడ్లపై పంటలు ఆరబెట్టవద్దు


మొహాళలో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

లోకేశ్వరం: రైతులు రోడ్లపై మొక్కజొన్న, సోయా, ధాన్యం కుప్పలను ఆరబెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని లోకేశ్వరం నుంచి ధర్మోర వెళ్లే రోడ్డుపై మొహాళ గ్రామంలో రైతులతో ఎస్సై మాట్లాడారు. పంటకుప్పలపై టార్పాలిన్ కప్పి రాళ్లు ఉంచితే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పంటకుప్పల కారణంగా ప్రమాదాలు జరిగితే రైతులే బాధ్యత వహించాలని.. వారిపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మొహాళ, ధర్మోర, పంచగుడి, పిప్రి, లోకేశ్వరం గ్రామాల రైతులు ఉన్నారు.

వన్యప్రాణులను కాపాడుకుందాం


కన్నాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కడెం: అడవులు, వన్యప్రాణులను కాపాడటం మనందరి బాధ్యతని ఎఫ్‌ఆర్‌వో గీతారాణి అన్నారు. 70వ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని కన్నాపూర్, పాండ్వపూర్ గ్రామాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డీఆర్వో సిద్దార్థ, ఎఫ్‌బీవోలు సీఎస్ఎన్ రాజు, జిజియా, రవి, శంకర్, సిబ్బంది తదితరులున్నారు.

నర్సాపూర్(జి): వన్యప్రాణులను సంరక్షిస్తేనే జీవకోటి మనుగడ సాధ్యమవుతుందని ఎఫ్ఎస్ఓ అలేఖ్య అన్నారు. మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో 70వ వన్యప్రాణి సప్త వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో సాయారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

సారంగపూర్: మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మ రాజు పలువురికి బీజేపీ సభ్యత్వం అందజేశారు. ప్రతి బూత్ నుంచి 200 మందిని.. బీజేపీలో సభ్యులుగా చేర్పడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. బీజేపీ సభ్యత్వం తీసుకునేందుకు 8800002024 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలన్నారు. రాంరెడ్డి, మంతెన గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని అందాకూర్, కల్లూరు, రాజాపూర్‌తండాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆ పార్టీ మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య, మాజీ ఎంపీపీ రమణారావు లక్ష్మణ్‌పటేల్, జక్కుల గజేందర్, తాటి శివ, మాధవరావు, ప్రశాంత్, వెంకటేశ్, శ్రీనివాస్, ఒడ్నం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాలకు తరలిన నాయకులు


కుంటాల నుంచి హైదరాబాద్ వెళ్తున్న నేతలు

కుంటాల: హైదరాబాద్‌లో మంగళవారం పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్ 35వ సమావేశాలు నిర్వహించగా కుంటాల నుంచి నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. పీఆర్టీయూ మండల కన్వీనర్ అంబకంటి సతీశ్, ప్రధాన కార్యదర్శి కొండ ప్రవీణ్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ బర్కుంట నవీన్, ఆర్ఆర్ శివ నాగేందర్, జిల్లా కార్యదర్శి రవీందర్, రాష్ట్ర కార్యదర్శి ఎం.సిద్దిరాం, సక్రపు రాజేందర్, చంద్రశేఖర్‌రావు, ఖడ్గం మోహన్ తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలోకి మండలవాసులు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని శామీర్‌పేట్‌లో మంగళవారం పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా పాతఎల్లాపూర్ హెచ్ఎం రమాదేవి, సుర్జాపూర్ ఉపాధ్యాయుడు దురిశెట్టి శ్రీనివాస్, గాంధీనగర్ ఉపాధ్యాయుడు కె.ప్రవీణ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మస్కాపూర్ పాఠశాల హెచ్ఎం బోనగిరి నరేందర్, జెడ్పీహెచ్ఎస్ ఖానాపూర్ బాలికల పాఠశాల ఉపాధ్యాయురాలు కె.శ్రీలత ఎన్నికైనట్లు పీఆర్టీయూ మండల, అధ్యక్ష కార్యదర్శులు అంబటి గంగన్న, బెజ్జారపు మురళి తెలిపారు. దాసరి నర్సయ్య, రాజ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

కుంటాల: భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన సిరిమణి రజనీకాంత్ కుంటాలలో ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూ లైబ్రరీ, పబ్లిక్ రీడింగ్ రూమ్‌లో చదివి ఎస్జీటీ ఫలితాల్లో ఎనిమిదో ర్యాంకు సాధించాడు. మంగళవారం కుంటాలలో రజనీకాంత్‌ను అతడి మిత్రులు సన్మానించారు. ఆముదారి ప్రవీణ్, ప్యాదరి గజేందర్, శేషరావు, ఇప్రోజ్, కృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

భక్తుల పాదయాత్ర

బాసర: మండల కేంద్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం నిజామాబాద్ జిల్లా నవిపేట్ మండలానికి చెందిన దుర్గాదేవి దీక్షాపరులు పాదయాత్రగా తరలివచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాదయాత్రగా వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

'ప్రతి ధాన్యపు గింజ కొనాలి'

భైంసాటౌన్: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడారు. ముధోల్ నియోజకవర్గంలో ఎక్కువగా సోయా సాగు చేస్తారని.. రైతులు పంట అమ్ముకునేందుకు సరిపడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని అధికారులకు సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు మహేశ్, రాజు, గౌతమ్ తదితరులు ఉన్నారు.

నేడు ఎంపీ రాక

ముధోల్: మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహించే బీజేపీ సభ్యత్వ కార్యక్రమానికి ఎంపీ నగేశ్ రానున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న ఓ ప్రకటనలో తెలిపారు. బాసరలోని సరస్వతి అమ్మవారిని ఎంపీ నగేశ్ దర్శించుకుంటారని బీజేపీ మండల నాయకులు పేర్కొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలలో..


నిర్మల్‌లోని వినాయక్‌నగర్ కాలనీలో..


లోకేశ్వరం: హావర్గలో..


కుంటాల: లింబా(కె)లో బతుకమ్మ వేడుకల్లో మహిళలు, యువతులు, చిన్నారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వాడవాడన బతుకమ్మ వేడుకలు కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజుల వేడుకల్లో భాగంగా ఏడో రోజైన మంగళవారం నిర్మల్‌లోని వినాయకనగర్ కాలనీలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. బియ్యపు పిండి, వేపపండ్లతో తయారు చేసిన నైవేద్యాన్ని గౌరమ్మకు సమర్పించినట్లు కాలనీ మహిళలు పేర్కొన్నారు.

కుంటాల: మండలంలోని లింబా(కె)లో మంగళవారం మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అనంతరం స్థానిక చెరువులు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

లోకేశ్వరం: మండలంలోని హావర్గ, ధర్మోర గ్రామాల్లో మంగళవారం రాత్రి బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పసుపు, కుంకుమలతో గౌరమ్మను తయారు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహిళలు, యువతులు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు.

నూతన కార్యవర్గం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘ భవనంలో మంగళవారం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లోకేశ్వరం మండల గౌరవాధ్యక్షుడిగా దండే రమేశ్, అధ్యక్షుడిగా మాదరి అంజనేయులు, ఉపాధ్యక్షుడిగా రాజు, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా ఎర్రన్న, కోశాధికారిగా గంగాధర్, గౌరవ సలహాదారులుగా హర్షముత్తన్న, మీడియా కన్వీనర్లుగా మధుకర్, రాజేందర్, సభ్యులుగా గంగన్న, రణదీర్, లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు.

విద్యార్థికి సన్మానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ కాలనీకి చెందిన తాండ్ర గాయత్రి–సుగుణాకర్ కుమారుడు సదానంద్ ఎంబీబీఎస్ ప్రవేశపరీక్షలో ఎనిమిదో ర్యాంక్ సాధించి.. గాంధీ మెడికల్ కాలేజీలో సీటు పొందాడు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి.. సదానంద్‌ను తన తల్లిదండ్రులతో కలిసి సన్మానించారు. గాంధీచౌక్ కౌన్సిలర్ మేడారం అపర్ణ ప్రదీప్, ఆమెడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని కాపాడుకుందాం

కడెం: బతుకమ్మ సంస్కృతీ,సంప్రదాయాలను కాపాడుకుందామని జననీ జన్మభూమి స్టూడెంట్స్, సూసైడ్స్ అండ్ క్రైమ్స్ ఎరాడికేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు భూమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని నవాబ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బతుకమ్మ ఆడే మహిళలు, సోదరిమణులు డీజే పాటలు, అసభ్యకర డ్యాన్సుల జోలికి వెళ్లవద్దని పిలుపునిచ్చారు.

అమ్మలగన్న అమ్మ.. సల్లంగా చూడమ్మ


లక్ష్మణచాంద: పార్‌పెల్లిలో భక్తుల పూజలు


కుంటాలలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


నిర్మల్‌లో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు


లోకేశ్వరం: ధర్మోరలో నోట్ల అలంకరణతో దర్శనమిస్తున్న అమ్మవారు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లిలో దుర్గాదేవి మండపం వద్ద మంగళవారం పూజలు నిర్వహించారు. గాజుల పూజ చేసి ఒకరికొకరు గాజుల వాయినాం ఇచ్చిపుచ్చుకున్నారు. నాగుల సవిత-భూమేశ్ దంపతులు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు జె.శ్రీనివాస్, గంగాధర్, నరేశ్, చిన్నారెడ్డి, విమలాకర్, భూమేశ్, వంశీ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద లలితా సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు.

కుంటాల: మండలంలోని కల్లూరు, కుంటాల, లింబా(కె) గ్రామాల్లోని దుర్గాదేవి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఖానాపూర్: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేసి పలు చోట్ల అన్నసంతర్పణ కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, పంచగుడి గ్రామాల్లో దుర్గాదేవి ప్రతిమలను మంగళవారం కరెన్సీ నోట్లతో అలంకరించారు. ధర్మోరలో రూ.5లక్షలు, పంచగుడిలో రూ.1,02,000 విలువైన నోట్లను హారాలుగా అమ్మవారి మెడలో అలంకరించారు. అనంతరం సహస్ర దీపారాధన నిర్వహించారు. జగదీశ్‌పంతులు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం


నర్సవ్వ కుటుంబంతో మోహన్‌రావు పటేల్

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన డొంకేశ్వర్ నర్సవ్వ ఇల్లు ఇటీవల పూర్తిగా కాలిపోయింది. మంగళవారం భైంసాకు చెందిన మోహన్‌రావు పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పటేల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం నిత్యావసర సరుకులు, తక్షణసాయం కింద రూ.5 వేలను సాయంగా అందించారు. అధైర్యపడొద్దని.. ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట నాయకులు సాయినాథ్, జీవన్, భూమన్న, వెంకట్ ఉన్నారు.